కంది రైతుకు రంది..!

- జిల్లాలో 36,200 ఎకరాల్లో కంది సాగు
- వర్షాలు లేక తగ్గిన పంట దిగుబడి
- చీడపీడలతో నాపగా మారిన గింజలు
- ఆందోళనలో రైతులు



కేశార్‌తో కంది పంట పడుతున్న రైతులు (ఫైల్)

కౌటాల: జిల్లాలోని కంది రైతుల ఆశలపై కంది పంట నీళ్లు చల్లింది. జిల్లాలో ఖరీఫ్ కాలంలో సకాలంలో వర్షాలు కురువకపోవడం.. మరోవైపు పొగమంచు కురవడంతో చీడపీడలు ఆశించి పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. కంది పంట సాగు చేస్తే ఏటా నష్టాలే వస్తున్న పరిస్థితుల్లో సైతం రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంట సాగు చేశారు. ఈసారి సైతం కంది పంట దిగుబడి పూర్తిగా పడిపోవడంతో జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకప్పుడు ఎకరానికి ఏడు క్వింటాళ్లకు తగ్గకుండా కంది పంట తీసిన రైతులు నేడు ఎకరానికి నాలుగు క్వింటాళ్లకు మించిరాని పంటను చూసి విస్తుపోతున్నారు.

ఎన్నో ఆశలతో సాగు..

జిల్లాలో కంది పంటను ఏటా విస్తారంగా సాగు చేస్తారు. 2024 వానాకాలం సీజన్‌లో బోర్లు, బావులు, వర్షాధారం కింద సాగు చేశారు. బోర్లు, బావుల కింద 30శాతం సాగు చేస్తే, వర్షాధారం కింద 70శాతం సాగవుతోంది. ఆరు నెలల కంది పంటను ఏటా రైతులు ఇష్టంగా సాగు చేస్తారు. వర్షాలు తక్కువగా కురిసినా, ఆ తర్వాత చలి కాలంలో తక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయని, పంట తప్పకుండా చేతికి వస్తుందన్న ఆశతో సాగు చేస్తారు. ఇక బోర్లు, బావులు ఉన్న రైతులు సైతం తినడానికి, మిగిలింది విక్రయించడానికి వస్తుందని సాగు చేస్తుంటారు. జిల్లాలో ఈసారి 36,200 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. 2లక్షలకు పైచిలుకు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో పత్తి, సోయా కంటే కంది దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉండేది. మధ్యలో చీడపీడలు సోకడంతో పూత రాలడంతో దిగుబడి తగ్గింది. అసలే అప్పులు చేసి పంటలు వేసిన చిన్న, సన్నకారు రైతులకు పంట దిగుబడి రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు తక్కువ ధరకు కందిని కొనుగోలు చేస్తున్నారు. పలువురు వారసంతల్లో కందులు విక్రయిస్తున్నారు.

మూడు కేంద్రాలు..!

జిల్లాలోని రైతులు గత నెలలో కంది కోతలు పూర్తి చేయగా.. ప్రస్తుతం చేనుల్లో పంట నూర్పిడి చేస్తున్నారు. అలాగే జిల్లాలో కంది పంట అమ్మకం జోరుగా కొనసాగుతోంది. ఓవైపు ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి గణనీయంగా తగ్గినా రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు నాఫెడ్, మార్క్‌ఫెడ్ సంయుక్తంగా జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. మార్క్‌ఫెడ్ వాణిజ్యపరమైన కొనుగోళ్లు చేపట్టినా, రైతులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశాలు లేవు. వ్యాపారులు, మార్క్‌ఫెడ్ మధ్యన వాణిజ్యపరమైన పోటీ ఉంటే రైతులకు మేలు జరుగుతుంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించినా.. మార్కెట్ ధరల మేరకు మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో రైతులు పంటను విక్రయించుకునే వీలుంటుంది. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, జైనూర్‌లలో కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో క్వింటాల్‌కు మద్దతు ధర రూ. 7,550లు కాగా ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ.7,200ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్న ధర కేవలం రూ.350లు మాత్రమే తక్కువగా ఉండటంతో రైతులు ప్రైవేట్ వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తే వెంటనే నగదు చేతికందే అవకాశం లేక రైతులు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం కంది పంటకు రూ.15 వేలు మద్దతు ధర కల్పించి, రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

దిగుబడి తగ్గింది..

కంది పంట సాగు చేసి ఆర్థికంగా లబ్ధి పొందాలనుకుంటే ఏటా కంది పంట సాగుతో నష్టాలే అధికంగా వస్తున్నాయి. నేను మూడు ఎకరాల్లో పత్తి పంటలో అంతర పంటగా కంది పంట సాగు చేశాను. ఈసారి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో కంది పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ఇంతకుముందు కంది పంట ఎక్కువ దిగుబడి వచ్చేది. ప్రభుత్వం రూ.15 వేలు కంది పంటకు మద్దతు ధర పెంచాలి. రైతులకు అందుబాటులో కౌటాలలో కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– దామోదర్, రైతు, బోదంపల్లి

క్లుప్తంగా

'ప్రజామరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి'



కెరమెరిలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఏపీవో మల్లయ్య

కెరమెరి: మండల కేంద్రంలో చేపడుతున్న ప్రజామరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. మంగళవారం ఆయన మరుగుదొడ్లను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత ఉండాలన్నారు. నేటి వరకు మరుగుదొడ్లు లేక పోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అనంతరం మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న ఇంకుడుగుంతను పరిశీలించారు.

దైవభక్తి చాటుకున్న చిన్నారులు



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న చిన్నారులు

బెజ్జూర్: మండల కేంద్రానికి సమీపంలో గల నాగమ్మ తల్లి విగ్రహం వద్ద ఉన్న పిచ్చి మొక్కలను మంగళవారం ఎలకపల్లి గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు తొలగించి శుభ్రం చేశారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు వస్తారని చిన్నారులు పిచ్చి మొక్కలు తొలగించారు. దీంతో చిన్నారులకు ఉన్న దైవభక్తిని పలువురు అభినందిస్తున్నారు.

'ఐక్యంగా ఉండి హక్కులు చాటాలి'

తిర్యాణి: పెరిక కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం రాజయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. అనంతరం సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చుంచు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ముత్తె నరసయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, మల్లేశ్, కార్యదర్శిగా పెట్టం రామన్న, కోశాధికారిగా బుచ్చన్న, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్, అంకతి శ్రవణ్ పాల్గొన్నారు.

నేడు పూజలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యావచనము, ధ్వజారోహణము, రుద్రాభిషేకం, బిల్వార్చనలు, ధర్మ దర్శనం, సాయంత్రం ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర, రాత్రి లింగార్చన, లోకకల్యాణార్థం, విశ్వశాంతి కోసం శివపార్వతుల కల్యాణమహోత్సవాన్ని నిర్వహించనున్నారు. పట్టణంలోని శ్రీ బాలేశ్వరస్వామి ఆలయం, సాంబశివాలయం, బుర్గుడ శివపంచాయతన క్షేత్రాలు పూజలకు సిద్ధమయ్యాయి.

ఆలయం ముస్తాబు

దహెగాం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని లగ్గాం గ్రామంలో ఉమాచంద్రశేఖర ఆలయం ముస్తాబైంది. ఏటా శివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామంలో జాతర సైతం నిర్వహిస్తారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేడు ఈజ్‌గాంలో జాతర

కాగజ్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి పురస్కరించుకుని మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో బుధవారం నిర్వహించే జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. విద్యుత్ దీపాలతో దేవాలయాన్ని అలంకరించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి రాంచందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు నైతిక విలువలు పాటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, అధ్యాపకులు నాయిని శ్రీనివాస్, కోటిచింతల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం.. తప్పిన ముప్పు



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బాపూనగర్ పాత కూరగాయల మార్కెట్ స్థలంలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం పాత మార్కెట్ స్థలంలో తోపుడు బండ్లపై పండ్లు విక్రయించే వారు, చీపుర్లు, పూసలు, బట్టలు అమ్మేవారు కవర్లు, చెత్తాచెదారం, పేపర్లను పడేస్తుండడంతో డంపింగ్‌యార్డుగా మారింది. దీనికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. వెంటనే కాలనీవాసులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పివేశారు. ఇప్పటికైనా వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పాత మార్కెట్ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా వెలసిన టేలాలను, చెత్తాచెదారాన్ని తొలగించి నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



జీఎంకు మొక్క అందజేస్తున్న విద్యార్థులు

రెబ్బెన: సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు జీఎంను కలిశారు. పాఠశాల విద్యార్థుల వివరాలను జీఎం అడిగి తెలుసుకున్నారు. పదిలో మెరుగైన ఫలితాల సాధన కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి తోటి విద్యార్థులతో పోటీ పడేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. అంతకు ముందు రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్‌లు జీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. కార్యక్రమాల్లో కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, హెచ్‌ఎం రవితేజ, పీఈటీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు

రెబ్బెన: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రం వద్ద అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేసిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి, ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మండలంలో పట్టభద్రులు 727 మంది, టీచర్స్ 29 మంది ఓటు కోసం పేర్లు నమోదు చేసుకున్నారని వారికి ఇప్పటికే ఓటర్ స్లిప్స్ పంపిణీ చేశామన్నారు. ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం గుర్తించిన గుర్తింపు కార్డులు ఏదైనా ఒకటి తమ వెంట తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రేంకిరణ్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో మహిళలకు ఆహారం, ఆరోగ్యం, పోషణ, ఆర్థిక అక్షరాస్యతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై వివరించారు. ఎస్ బిఐ బ్యాంకు తరపున మహిళలకు అందజేస్తున్న రుణాలు, రుణాల సద్వినియోగం, ఆర్థి క అక్షరాస్యతలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఎం దుర్గ య్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ నూతన రెడ్డి, సీసీలు, వీవోఏలు, మహిళలు పాల్గొన్నారు.

హోరాహోరీగా వేలం

కౌటాల: కౌటాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ సీజన్-1లో భాగంగా మంగళవారం కౌటాల మినీ స్టేడియంలో క్రీడాకారుల వేలం హోరాహోరీగా సాగింది. ఈ లీగ్‌లో సిర్పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని మొత్తం 230 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేలంలో పది ఫ్రాంచైజీలు పాల్గొన్నాయి.

'పెట్రోల్ బంక్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి గొడిసెల కార్తీక్‌లు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్ (రెవెన్యూ)కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని చాలావరకు పెట్రోల్ బంకుల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఎయిర్ ఫిల్లింగ్ పరికరం, పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. నాయకులు జాడి తిరుపతి, మాలశ్రీ, తదితరులు ఉన్నారు.

సన్మార్గంలో నడవాలి

సిరికొండ: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో ఉంటూ సన్మార్గంలో నడవాలని సంత్ శ్రీ నారాయణ్ మహరాజ్ భక్తులకు ప్రవచనాలు బోధించారు. మంగళవారం రాజంపేట్ గ్రామంలో సప్తాహ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'మన అమ్మవారికి మన సారె'



పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రామాలయంలో మంగళవారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో 'మన అమ్మవారికి మన సారె' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా హనుమాన్ విగ్రహం నుంచి ఆలయం వరకు అమ్మవారిని భాజాభజంత్రీల మధ్య పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనం, గుడుంబా

దహెగాం: మండలంలోని మత్రిపల్లి గ్రామానికి చెందిన జర్పుల ఆలు అనే వ్యక్తి నాటు సారా తరలిస్తున్నందున అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం జర్పుల ఆలు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నామని పేర్కొన్నారు. 10 లీటర్ల నాటుసారా, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్సై రవి సిబ్బంది ఉన్నారు.

ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నవేగూడ గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. కొలతల ప్రకారంగా పనులు చేస్తే ప్రతీరోజు రూ.300 కూలీ వేతనం వస్తుందని, వారానికి రూ.1800 సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ఉదయం త్వరగా పనులకు వెళ్లి ఎండలు ముదరక ముందే ఇంటికి చేరుకోవాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్ కుమార్, ఈసీ మోసిన్ ఉన్నారు.

'బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి'



పెంచికల్‌పేట్: కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి కోరారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం, కేజీబీవీ, వాసవి పాఠశాలల్లో ఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు సుంకరి పెంటయ్య, నాయకులు ప్రసాద్ గౌడ్, వెంకన్న, సుదర్శన్‌గౌడ్, రాంబాబు, సంతోష్, మధుకర్, కిరణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామంలో ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీశ్‌బాబు మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నిరుద్యోగుల పక్షాన శాసనమండలికి పంపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఎమ్మాజి, మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేవైఎం మండల అధ్యక్షుడు సంతోష్, నాయకులు జునుగరి మధుకర్, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య, పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కొట్నాక్ విజయ్, నాయకులు వెంకట్, లాల్‌సింగ్, కిష్టునాయక్, బాలు తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని ఆశీర్వదించండి'



పెంచికల్‌పేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికల్‌పేట్: పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పట్టభద్రులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ నియామకాలు చేపట్టి చరిత్ర సృష్టించిందన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే నరేందర్‌రెడ్డిని శాసన మండలికి పంపించాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందన్నారు. నాయకులు సముద్రాల రాజన్న, రాచకొండ కృష్ణ, చంద్రమౌళి, చౌదరి శ్రీనివాస్, శంకర్‌గౌడ్, సిరిపురం సదాశివ్, సురేశ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఆదరించాలి

రెబ్బెన: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని ఆదరించాలని యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పూదరి హరీశ్ కోరారు. మంగళవారం మండలంలోని తుంగెడలో నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు మల్లయ్య, వెంకటి, మహేందర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత సుల్తాన్ 11స్టార్



బహుమతి అందుకుంటున్న విజేత టీం

కెరమెరి: మండలంలోని కరంజివాడ రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. విజేతగా సుల్తాన్ 11 స్టార్ టీం నిలిచింది. వీరికి ప్రథమ బహుమతి దివ్య ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ రూ.21 వేలు అందజేశారు. ద్వితీయ స్థానంలో కరంజివాడకు చెందిన రాక్ స్టార్ టీం నిలవగా కెనరా బ్యాంకు మేనేజర్ జాదవ్ సందీప్ రూ.11 వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బలవంత్ నాయక్, ఉదారాం, ప్రకాశ్, పరుశురాం నాయక్, నందులాల్, తదితరులు ఉన్నారు.

భూసారం పెంచేందుకు కృషి



యంత్రం ద్వారా పత్తి కట్టెలు కాలుస్తున్న నిర్వాహకులు

ఇంద్రవెల్లి: వ్యవసాయ భూముల్లో భూసారం పెంచేందుకు కాటన్ గురు మహా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని సంస్థ ప్రతినిధులు తన్మయ్ దాగా, రాజేందర్ కాప్సేలు అన్నారు. మంగళవారం మండలంలోని పలువురు రైతుల వ్యవసాయ చేనుల్లో పత్తి కట్టెలు కాల్చడం ద్వారా వచ్చే నష్టాలపై అవగాహన కల్పించారు. సంస్థ ఆధ్వర్యంలో క్వాంటికి యంత్రాలు ఏర్పాటు చేసి పత్తి కట్టెలు కాల్చారు. కాల్చిన తరువాత పత్తి కట్టెల బొగ్గును సేకరించారు. పత్తి కట్టెలను కాల్చడం ద్వారా భూమిలో పోషకాలు నశిస్తాయన్నారు. సేకరించిన బొగ్గును సేంద్రియ ఎరువుగా తయారు చేసి రైతులకు అందిస్తామని పేర్కొన్నారు. సంస్థ సిబ్బంది వశిష్ఠ, పోశెట్టి, కమలాకర్, జోసెఫ్, రైతులు తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం'



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

ఉట్నూర్‌రూరల్: అన్ని వర్గాలకు సమ న్యాయాన్ని చేకూర్చేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విజయోత్సవ సభ మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంతో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. చైర్మన్ రాకతో మాదిగ కులస్తులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని అంబేద్కర్, లోక్ సాహిర్ అన్న బాహుసాతే, బాబు జగ్జీవన్ రాం విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డప్పుచప్పుళ్లతో సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఎస్సీ సెల్ నాయకులు చంద్రయ్య, లాజర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

నార్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన సందర్భంగా జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కోర్శ్ల మహేందర్ సన్మానించారు.